ఉత్తుత్తి.. ఉచిత బస్సు


వేంపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆర్టీసీ బస్సు

వేంపల్లె : సార్వత్రిక ఎన్నికల్లో గద్దెనెక్కడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు గుప్పించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ.1500, యువతకు నిరుద్యోగభృతి కింద రూ.3 వేలు, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. టీడీపీ, కూటమి నేతలు, సీఎం కుర్చీనెక్కిన చంద్రబాబునాయుడు తూతూ మంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రారంభించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి ప్రకటించగా... ఇంకో ఆమాత్యుడు నారా లోకేష్ రోడ్డు మ్యాప్ వేసి ఈ ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామన్నారు. ఏకంగా సీఎం చంద్రబాబు హామీలు చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించిన తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం లేనట్టేనా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కేవలం ప్రచార ఆర్భాటం

టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి 8 నెలలు గడుస్తున్నా కనీసం హామీల అమలు ఉచిత ప్రయాణం ఇంకెప్పుడూ అని ప్రశ్నిస్తున్నారు. మహిళలు ఆంధ్ర ప్రదేశ్ కంటే ముందుగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, అటూ తెలంగాణ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేసింది. తమిళనాడు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటినుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను ఫాలో అయ్యి జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఉచిత బస్సు హామీ నేటికి కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్య పెట్టారని సుస్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.


వేంపల్లె ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

1,13,564 మంది మహిళలు

పులివెందుల నియోజకవర్గంలో మొత్తం జనాభా 2 లక్షల మందికిపైగా జనాభా ఉన్నారు. అందులో 18 ఏళ్ల పైబడిన మహిళలు 1,13,564 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు, పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. అందుకోసమే మహిళా ఓట్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీలు గుప్పించారు. ప్రతిరోజు సగటున 40 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

ఇప్పటివరకు ఉచిత ప్రయాణంపై స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటివరకు కనీస స్పష్టత ఇవ్వడం లేదు. రోడ్డు రవాణా శాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడమే తప్ప, ఎప్పటి నుంచి ఈ విషయంపై స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ దీపావళి మహిళలకు దీపావళి కానుక అని వదంతులు సోషల్ మీడియాలో హల్చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికి తోడు ఏకంగా సీఎం చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది.

సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం అమలు చేసింది కదా ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఇదేం పద్ధతి.. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయాలి.

– టి.అంజేశ్వరి, స్థానికురాలు, చాకలి వీధి, వేంపల్లె

హామీలు ఇచ్చేటప్పుడు ఆలోచించాలి



ఎన్నికల ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చుని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుంది అంటే ఎలా. టీడీపీ నాయకులు ఆరోజు ఇంటింటికి వచ్చి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పుడేమో ఉచిత ప్రయాణంపై అతీ గతి లేదు.

– టి.రాధిక, స్థానికురాలు, సంఘం వీధి, వేంపల్లె

క్లుప్తంగా

‘ఉల్లాస్’తో అక్షర జ్ఞానం

కమలాపురం : ఉల్లాస్ కార్యక్రమంతో నిరక్షరాస్యుల్లో అక్షర జ్ఞానం కలుగుతుందని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించి ఉల్లాస్ పుస్తకాలను విడుదల చేశారు. కనీస అక్షర జ్ఞానం లేని చాలా మంది వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి ఇబ్బందులను నివారించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కమలాపురం : స్థానిక రైల్వే గేటు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాజశేఖర్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి రైల్వే గేటు సమీపంలో తనిఖీలు చేపట్టామన్నారు. కమలాపురం పట్టణానికి చెందిన రాజశేఖర్‌ను తనిఖీ చేయగా అతడి వద్ద 10 క్వార్టర్ బాటిళ్లు ఉండటం గమనించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఫిబ్రవరి 1న కాశీ మహా పాదయాత్ర

సింహాద్రిపురం : కాశీ మహా పాదయాత్రను ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభిస్తున్నట్లు కసనూరు గ్రామానికి చెందిన శివయ్యగారి సాంబశివారెడ్డి తెలిపారు. ఈ కాశీ మహా పాదయాత్ర దాదాపుగా 45 రోజులపాటు కొనసాగుతుందన్నారు. ఈ పాదయాత్ర కసనూరులో ప్రారంభమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా కొనసాగుతుందన్నారు. ప్రపంచ శాంతి కోసం అందరూ బాగుండాలని ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. పాదయాత్రలో పాల్గొనేవారు 9704 288772 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

జీపు జాతను విజయవంతం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం జరిగే జీపు జాతను విజయవంతం చేయాలని సీపీఎం కార్యవర్గ సభ్యుడు బి.మనోహర్, పట్టణ కార్యదర్శి ఏసుదాసు తెలిపారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగే జీపు జాత కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. అనంతరం జీపు జాత కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో మార్పులు

వల్లూరు : మండలంలోని పైడికాలువ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు వుంటాయని ఏఈ డ్యానియల్ జోసెఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా వ్యవసాయ పంపుసెట్లకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో మార్పులు వుంటాయన్నారు. మాచనూరు, కోనాయపల్లి ఫీడర్లకు తెల్లవారుజామున 4 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు, చావలి, పైడికాల్వ ఫీడర్లకు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. మిగిలిన 2 గంటల విద్యుత్‌ను అన్ని ఫీడర్లకు రాత్రి 10 గంటల నుండి 12 గంటల వరకు సరఫరా చేస్తారన్నారు. పైడికాలువ సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రీకాశిరెడ్డి నాయన జయంతి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో శ్రీకాశిరెడ్డి నాయన

లింగాల : వనంబావి శి వాలయం వద్ద వెలసిన శ్రీకాశిరెడ్డి నాయన ఆలయంలో మంగళవారం కాశిరెడ్డి నాయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాశిరెడ్డి నాయన విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని లింగాల, లోపట్నూతల, గుణకణపల్లె, రామనూతనపల్లె తదితర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చి శ్రీకాశిరెడ్డి నాయను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అదేవిధంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి గుణకణపల్లె గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులు నిర్వహించిన చెక్కభజన భక్తులను ఆకట్టుకుంది.

నీటి సరఫరా బంద్

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో రేపటి నుంచి రెండు రోజులపాటు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం జలాశయం నుంచి వచ్చే నీటిని దొమ్మరనంద్యాల గ్రామం వద్ద వున్న సంప్‌ను శుభ్రం చేస్తున్నామన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

నేడు పాఠశాల భవనాలు ప్రారంభం


ప్రారంభానికి ముస్తాబైన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సింహాద్రిపురం : స్థానికంగా నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను బుధవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రారంభించనున్నారు. ఈ పాఠశాల నూతన భవనాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కింద నిర్మాణ పనులు చేపట్టి దాదాపు రూ.2.50 కోట్లకు పైబడి 90 శాతం పనులు పూర్తి చేయించారు. కేవలం పాఠశాలలో 10 శాతం మాత్రమే పనులు మిగిలి ఉన్నాయి. ఈ పనులను పూర్తి చేసి ప్రారంభించాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేక పోయాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు మిగిలిన 10 శాతం పనులు చేసి ఆర్భాటం చేస్తున్నారన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వేంపల్లె : మండలంలో ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీవో కులాయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచులు మండలంలో ఉన్న పలు సమస్యలపై నిలదీశారు. ముఖ్యంగా వేంపల్లె పంచాయతీలో పాపాఘ్ని నది నుండి తాగునీరు రావడంలేదని, కేవలం బోరు నీరు ద్వారా డైరెక్టుగా పంపిస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు స్పందించిన పంచాయతీ ఈవో వెంకట సుబ్బారెడ్డి వచ్చే నెలాఖరుకల్లా పాపాఘ్ని నదిలో ఫిల్టర్లను వేయించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, పారిశుద్ధ్య కార్మికులు వారం రోజులు గడుస్తున్నా తమ వీధుల్లోకి రావడం లేదన్నారు. ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, భారతిలు ప్రధాన రహదారులైన కడప, పులివెందుల, గండి రోడ్డులలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో వాణిజ్య సముదాయాలు, వ్యాపారాలు సరిగా జరగకపోవడంతో ఆర్థికంగా వెనకబడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ఆర్ అండ్‌బీ ఏఈ మనోహర్‌రెడ్డి ఇప్పటికే రోడ్డుకిరువైపులా డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేశామని, తొందరలోనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు పలు సమస్యలపై చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రవణమ్మ, మెహతాబ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు, ఏఓ రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, ఐసీడీఎస్ నాగేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్‌కు ఎంపిక


వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీ ప్రకాష్ సీనర్జీ పాఠశాలలో నిర్వహించిన నేషనల్ స్కూల్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు టి.తనుశ్రీ, కౌశిక్‌లు పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మార్చి 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సెర్బియాలో నిర్వహించనున్న వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనున్నారన్నారు. ప్రతిభ కనబరచడంపట్ల విద్యార్థులను నగదు బహుమతితో సత్కరించారు. వారి విజయానికి సహకరించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కరస్పాండెంట్‌తోపాటు మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డిలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పొడదుర్తిలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శివజ్యోతి

కమలాపురం : పాడి పరిశ్రమ రైతుల అభివృద్ధి కై ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దచెప్పలి పశు వైద్యాధికారిణి శివ జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని పొడదుర్తిలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరం నందు 51 సాధారణ చికిత్సలు, 16 గర్భ సంబంధిత చికిత్సలు, 18 చూడి నిర్ధారణ పరీక్షలు, 23 గేదెలకు, 28 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 39 లేగ దూడలకు ఏలికపాము మందులు అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తద్వారా తమ పాల దిగుబడిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు


యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో యూరియా కొరతలేదని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం 2వ ఆర్ఎస్‌కేలో ఉన్న యూరియాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో యూరియా కొరత లేదన్నారు. కమలాపురం 2వ ఆర్ఎస్‌కే 440 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే గంగవరంలో 125 బస్తాలు, టి.చదిపిరాళ్లలో 150 బస్తాలు, జంభాపురంలో 120 బస్తాలు, పొడదుర్తిలో 100 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. అలాగే ఎర్రగుంట్ల మండలంలో చిన్నదండ్లూరు ఆర్ఎస్‌కేలో 120 బస్తాలు, కలమల్లలో 120 బస్తాలు ఉన్నాయన్నారు. వీఎన్‌పల్లె మండలం రాజుపాలెం ఆర్ఎస్‌కేలో 340 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు.. అలాగే కమలాపురం వార్డు1కు బుధవారం 440 బస్తాల యూరియా వస్తుందన్నారు. యూరియా ఎక్కడా కొరత లేదని, కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కేలకు వెళ్లి తీసుకోవచ్చన్నారు. యూరియాలో 46 శాతం నత్రజని ఉంటుందన్నారు. యూరియా సన్నదైనా, లావు అయినా ఒకటేనని, రెండింటిలో నత్రజని 46 శాతం మాత్రమే ఉంటుందని, అలాగే భారత్ యూరియా బ్రాండ్ పేరుతో మాత్రమే ఉంటుందన్నారు. ఏఈఓ దస్తగిరి, వీఏఏ శివరంజని పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

చింతకొమ్మదిన్నె : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 10వ తేదీ ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై సమావేశంలో సమీక్ష చేయనున్నారు.

పరామర్శ


రామకృష్ణారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చప్పిడి రామకృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని రామకృష్ణారెడ్డి భార్య విమలమ్మను పరామర్శించారు. రామకృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, పురుషోత్తమరెడ్డి, రాజశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి, పెద్దకుడాల మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, నాగేంద్రనాథరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె..


మాజీ సర్పంచ్ అడవి వెంకటయ్యను పరామర్శిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి మంగళవారం మండలంలోని పబ్బాపురం గ్రామ మాజీ సర్పంచ్ అడవి వెంకటయ్యను పరార్శించారు. వెంకటయ్య మాతృమూర్తి రెడ్డెమ్మ(90) మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉపమండలాధ్యక్షుడు సుధాకరరెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రభాకరరెడ్డి, గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కమలాపురంలోని వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీలో బీమా శక్తి, నవత ట్రాన్స్‌పోర్టులో క్లర్క్, డ్రైవర్, క్లీనర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 5వ తరగతి, టెన్త్, డిగ్రీ, పీజీ చదివి 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికయిన వారికి హోదాను బట్టి రూ. 7 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హతలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని ఆయన సూచించారు.

సాధికారిక సర్వేలో మార్పులు చేయాలి

వేంపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే లబ్ధిదారులకు చంద్రన్న సాధికారిక సర్వే ఇబ్బందిగా ఉందని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధికారిక సర్వేలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, 2016లో అప్పటి ప్రభుత్వం ఇంటింటికి సర్వే జరిపి కుటుంబ సభ్యులకు ఐడి నెంబర్లలో కేటాయించారని, తర్వాత ఆ కుటుంబంలోని సభ్యులు పెళ్లిళ్లు చేసుకుని వేర్వేరు ప్రాంతాల్లో కాపురాలు ఉంటున్నారన్నారు. ఉమ్మడి కుటుంబంలో వారి ఆధార్ నెంబర్లు అనుగుణంగా సర్వేలో వివిధ ఐడిలు కేటాయించారని, అయితే ఇంటి పెద్ద ఆధార్ నెంబర్ కిందనే సభ్యులందరూ ఉండటంతో ఇంటి యజమానికి ఏ పథకం వర్తించకుండా పోతోందని, ఇంటిలో పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని వేరే కాపురం ఉంటున్న వారి ఆదాయం ఇంటి యజమానికి చూపుతుండటంతో ఆ యజమాని ప్రభుత్వ పథకానికి అర్హత లేకుండా పోతోందన్నారు. పిల్లలు వెళ్లిపోయిన తర్వాత రేషన్ కార్డులో భార్యాభర్తలిద్దరే ఉన్నా పథకానికి అప్లై చేసుకున్నప్పుడు సాధికారక సర్వేలోని కుటుంబ సభ్యుల ఆదాయం చూపుతుండటంతో వారి దరఖాస్తులను ఆమోదించకుండా వెనక్కి పంపుతున్నారన్నారు. సాధికారిక సర్వేలో ఉన్న ఇతర కుటుంబ సభ్యుల పేర్లను తొలగించడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వాల్సిందిగా ఎంతోమంది కోరుకుంటున్నారన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులతో మాట్లాడితే ప్రభుత్వం అనుమతి ఇవ్వనిదే ఏమి చేయలేమని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై తగిన చర్యలు తీసుకుని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరయ్యేలా చూడాలని, సాధికారక సర్వేలోని ఇతర కుటుంబ సభ్యుల వివరాలు తొలగించడానికి అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పట్ల దృష్టి సారించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మంజూరు చేసే పక్కా గృహాలకు హౌసింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి పొసిషన్ సర్టిఫికెట్లు జారీ చేసి బిల్డింగులు మంజూరు చేయాలని హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డికి సూచించారు. ఉపాధి పని దినాలు 2 లక్షలకు పెంచాలని ఏపీఓ పార్థ సారథికి సూచించారు. చాలా గ్రామాల్లో రోడ్ల పైనే మురుగు పారుతోందన్నారు. ఎస్‌డబ్ల్యూపీఎస్ సెంటర్లను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీల ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఏఓ సరస్వతి, ఈఓపీఆర్‌డీ కెజియా, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, రాఘవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చూడముచ్చటగా చుట్టేస్తుంది..!

పెద్దముడియం : వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోయింది. ఒకప్పుడు పశువుల మేతగా ఉపయోగించే గడ్డిని కోత కోసి విక్రయించేవాళ్లు. కాలానుగుణంగా మార్పులు చోటు చేసుకోవడంతో వరిగడ్డిని కోత కోసి చుట్టలు చుట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి క్షణాల్లో వరిగడ్డిని చూడముచ్చటగా చుట్టేస్తాయి. రవాణా చేయడానికి ఎంతో సులభంగా ఉంటుంది. రైతులు సైతం వాటి పైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వరి గడ్డి చుట్టలకు డిమాండ్ ఏర్పడింది. పొలాల్లోనే యంత్రం సాయంతో గడ్డిని చుట్టలుగా చుట్టేసి ఒక్కో కట్ట రూ.70 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు నిల్వ ఉంచుకుని పశువులకు దాణాగా ఉపయోగించుకుంటున్నారు.


వరిగడ్డిని చుట్టలుగా కట్టేసిన యంత్రం

ప్రభుత్వ సేవలు అందక గ్రామీణ ప్రజల అవస్థలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 500లకుపైగా సేవలు
- ఆధార్ అప్‌డేట్ కోసం తప్పని తిప్పలు



పులివెందుల మండల పరిధిలోని అచ్చివెల్లి గ్రామ సచివాలయం

పులివెందుల రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాలలో సచివాలయాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా సుమారు 500లకుపైగా సేవలను అందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు దూరం చేసింది. సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు కేవలం పింఛన్ల పంపిణీకి మాత్రమే పరిమితమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలు అందక గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లాలన్నా తిప్పలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ జనాభా ప్రాతిపదికన 2వేల జనాభా ఉన్న పంచాయతీలకు సుమారు రూ.40లక్షల వ్యయంతో సచివాలయాలు ఏర్పాటు చేయడం జరిగింది. లక్షలాది రూపాయలతో రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది.

సచివాలయ ఉద్యోగులే దిక్కు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డుగోలుగా విమర్శలు చేశారు. సచివాలయ వ్యవస్థ పెట్టడంవల్ల ఎటువంటి ఉపయోగం లేదని అవగాహన లేకుండా మాట్లాడారు. అయితే ఈ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కయ్యారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్లు అవ్వ తాతలకు దివ్యాంగులకు వితంతువులకు తెల్లవారకముందే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను పక్కనపెట్టి సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు అమలు లేకపోవడం, సేవలు నిలిచిపోవడంతో సచివాలయ కార్యాలయాల్లో ఉద్యోగులు ఖాళీగా కూర్చొని కాలయాపన చేస్తున్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం తప్పని తిప్పలు

పులివెందుల మండలంలోని ప్రజలు ఆధార్ అప్‌డేట కోసం తిప్పలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడంతో వారు పట్టణాలకు రావాల్సి వస్తుంది. దీంతో ఆధార్ అప్‌డేట కోసం తిప్పలు తప్పడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.